నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 2 ఆగస్టు 2024 | SIDDIPET

బీఆర్ఎస్ హయాంలో గౌరవెల్లి రిజర్వాయర్ ట్రయల్‌రన్‌లో భాగంగా పంపులు ఆన్ చేయగానే రిజర్వాయర్‌లోకి దుంకుతున్న గోదావరి జలాలు (ఫైల్)

'గౌరవెల్లి'కి క్యాబినెట్ ఆమోదం

తుది దశ పనులు, కాల్వల నిర్మాణానికి రూ.437కోట్ల నిధులు

- కేసీఆర్ హయాంలో రూ.2400కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం
- ట్రయల్‌రన్ పూర్తి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- కాల్వల నిర్మాణం పూర్తయితే హుస్నాబాద్ ప్రాంతం సస్యశ్యామలం

హుస్నాబాద్, ఆగస్టు 1: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసేందుకు గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. రిజర్వాయర్ తుదిదశ పనులతో పాటు కాల్వ నిర్మాణం, భూసేకరణ కోసం రూ.437 కోట్లు కేటాయిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసింది. ప్రభుత్వం కేటాయించిన నిధులు సకాలంలో విడుదలై వెంటనే పనులు ప్రారంభమైతే త్వరలోనే హుస్నాబాద్ నియోజకవర్గంలో గోదావరి జలాలు జలతాండవం చేసే అవకాశం ఉన్నది. ప్రభుత్వం గౌరవెల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపునకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా రిజర్వాయర్ పనులు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

టయల్‌రన్ నిర్వహించిన బీఆర్ఎస్ సర్కారు

సాగు, తాగునీటికి అల్లాడుతున్న హుస్నాబాద్ మెట్ట ప్రాంత ప్రజలు, రైతుల కోసం వరద కాల్వలో భాగంగా నిర్మించ తలపెట్టిన గౌరవెల్లి రిజర్వాయర్‌ను రీడిజైన్ చేసి ఈ ప్రాంతం మొత్తానికి సరిపోయే విధంగా బీఆర్ఎస్ సర్కారు నిర్మాణం చేపట్టింది. 2007లో శంకుస్థాపన చేసినప్పటికీ 2009 నుంచి 2012 వరకు 1.23టీఎంసీల సామర్థ్యం కోసం కట్టనిర్మాణం చేపట్టారు. అనంతరం పనులు ముందుకు సాగలేదు. 2014లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం రిజర్వాయర్ సామర్థ్యాన్ని 8.23టీఎంసీలకు పెంచి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి 95శాతం పనులు పూర్తి చేసింది. టన్నెల్, పంపుహౌస్ నిర్మాణం, మూడు భారీ మోటార్లు, పంపుల బిగింపు జరగడం, కట్ట నిర్మాణం పూర్తవడంతో అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ రెండు సార్లు ట్రయల్ రన్ నిర్వహించి ప్రాజెక్టులోకి సుమారు 0.5టీఎంసీల నీటిని సైతం నింపారు. ఎన్‌జీటీ కేసుతో నీటి పంపింగ్‌కు బ్రేక్ పడింది. కాల్వల నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. అంతలోనే ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టు నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. కొత్త ప్రభుత్వంలో మంత్రివర్గం నిధులు కేటాయించి ప్రాజెక్టును పూర్తి చేస్తామని తీర్మానం చేయడంతో భూనిర్వాసితులు, రైతులు, ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురించినట్లయింది.

గౌరవెల్లి రిజర్వాయర్ పంపుహౌస్‌లో మోటార్లను ఆన్‌చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే వొడితెల (ఫైల్)

సీఎం క్షమాపణ చెప్పాలి

ఉమ్మడి మెదక్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం

సంగారెడ్డి, ఆగస్టు 1: రాజ్యాంగబద్ధమైన శాసనాలను తయారు చేసే శాసనసభ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలను చూడకుండా అవమానపర్చడం సిగ్గుచేటని, సీఎం భేషరతుగా మహిళలకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాలతో సంగారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు సీఎం దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారిపై దహనం చేశారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళా నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఎందుకు కల్పిస్తున్నారు, మహిళా ప్రజాప్రతినిధులను అవమానించేందుకా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సభలో ప్రతిపక్ష నాయకులు అడిగిన వాటికి సమాధానం చెప్పలేకే దాటవేసే ధోరణికి పాల్పడుతూ మహిళా ఎమ్మెల్యేలను అవమానపర్చడం సీఎం హోదాకు తగదని దుయ్యబట్టారు. ఏడు నెలల పాలనలోనే 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా తయారైందని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభకు నల్లబడ్జీలతో హాజరైతే అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క రోజు కూడా మార్షల్స్‌తో సభ్యులను బయటికి పంపించిన దాఖలాలు ఉన్నాయా అని నిలదీశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడం చేతకాక ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు సభలో ప్రతిపక్ష సభ్యులకు గౌరవం ఇవ్వని కాంగ్రెస్ సభ్యుల తీరును ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో శ్రావణ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, దిడ్డి విఠల్, రుక్ముద్దీన్, అజీమ్, చింటూ, సందీప్‌గౌడ్, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు

సిద్దిపేటలో సీఎం దిష్టిబొమ్మ దహనం

సిద్దిపేట, ఆగస్టు 1: మహిళా ఎమ్మెల్యేలపై సీఎం అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపర్చడం బాధాకరమని బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా, విద్యార్థి, యువజన విభాగం నాయకులు రాస్తారోకో నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మున్సిపల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు సుందర్, మల్లికార్జున్, కోఆప్షన్ సభ్యుడు సత్తయ్య, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు యాదగిరి, నాయకులు మోయిజ్,శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య, సాయిప్రేమ్, వెంకట్, రాజు, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు నరసమ్మ, మహిళా విభాగం నాయకురాళ్లు నరసవ్వ, అనిత, పద్మ, లక్ష్మి, నాగవ్వ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు, ఆగస్టు 1: వ్యర్థాల నిర్వహణ-వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, ఐపీఎల్ అంతర్జాతీయ ఫోరం 2024పై 14వ అంతర్జాతీయ సదస్సును గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహించనున్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులతో చర్చలు, విజ్ఞాన భాగస్వామ్యాన్ని సులభతం చేయడానికి ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1వరకు హైబ్రిడ్ విధానంలో సదస్సును నిర్వహించనున్నామని నిర్వాహకులు గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వ్యర్థాల నిర్వహణ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అనేక ఇతివృత్తాలు, వ్యర్థాలు, విధానాలు, నిబంధనలు, ఇంజినీరింగ్, సాంకేతికత, సామాజిక, వ్యాపార, పరిశ్రమలు వంటివి ఉంటాయన్నారు. విద్యారంగ ప్రతినిధులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల్లో పని చేసేవారు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, నియంత్రణ సంస్థల ప్రతినిధులు, ఆరోగ్య పరిరక్షణ సంస్థలు, ఇతర ఆసక్తిగలవారు సెప్టెంబర్ 15లోగా ఈ-మెయిల్iconswm.ce@gmail.com/ iconswme@gitam.edu ద్వారా సమర్పించాలన్నారు.నిర్దిష్ట రుసుం చెల్లించి వ్యక్తిగతంగా లేదా ఆన్‌లైన్‌లో సదస్సుకు హాజరుకావచ్చని, కాన్ఫరెన్స్ ఈ-ప్రొసీడింగ్స్ కూడా ప్రచురిస్తామన్నారు. సదస్సుతోపాటు, స్కూల్ కాంగ్రెస్, హ్యాకథాన్, ఇండస్ట్రీ ఎక్స్‌పోలను నవంబర్ 27న నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం సాధన్ కేఘోష్ 9830044464, థోర్లన్ 8886785076 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి

- అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సయోధ్య లేక గొడవలు
- శాసనమండలిలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు1: ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కోరారు. అటవీ, రెవెన్యూశాఖల మధ్య సయోధ్య లేక గొడవలు జరుగుతున్నాయని గురువారం శాసన మండలిలో ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మెదక్ నియోజకవర్గంలోని చిన్నశంకరంపేట మండలం ఎస్‌కొండాపూర్, గజగట్లపల్లి, మందాపూర్ గ్రామాల్లో సుమారు 70 ఏండ్ల క్రితమే ప్రజలు ఇండ్లు నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఈ మధ్య అటవీశాఖ అధికారులు ఆ స్థలం అటవీశాఖకు చెందింది అంటూ ఇండ్లను ఖాళీ చేయాలంటున్నారన్నారు. పాపన్నపేట, మెదక్ మండలంతో పాటు మెదక్ పట్టణంలో 59 జీవో ద్వారా భూమికి డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయలేదని పేర్కొన్నారు.

ఈ నీరెట్లా తాగాలి..!

- మిషన్ భగీరథ కింద కలుషిత నీరు సరఫరా
- వాడుకోవడానికి సైతం పనికి రాకుండా జలం
- భయాందోళన చెందుతున్న మండల ప్రజలు

సంగారెడ్డి జిల్లా చీకూర్తిలో నల్లాల్లో నుంచి సరఫరా అవుతున్న పచ్చనిరంగులో కలుషితమైన మిషన్ భగీరథ నీరు

న్యాల్‌కల్, ఆగస్టు 1: మిషన్ భగీరథ కింద సరఫరా చేస్తున్న తాగునీరు పూర్తిగా కలుషితంగా వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రాఘవపూర్ గ్రామ శివారులోని ఫిల్లర్‌బెడ్ ద్వారా న్యాల్‌కల్ మండలంతో పాటు ఝరాసంగం తదితర గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది నిర్లక్ష్యంతో ఫిల్టర్ చేయకుండానే గ్రామాలకు పచ్చని రంగులో తాగునీరు సరఫరా కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో వ్యవసాయ బావులకు వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఐదు రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు పూర్తిగా పచ్చని రంగులో మురికిగా వస్తున్నాయి. ఈ నీరు తాగితే ఎలాంటి జబ్బుల బారిన పడతామోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మంజీరా నదిలో నుంచి నీటిని తోడేసి ఫిల్టర్ చేయకుండానే నేరుగా కలుషిత తాగునీరు సరఫరా చేస్తున్నా, సంబంధిత అధికారుల పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యంతో చెలగాటం అడుతున్నారని వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలని కోరుతున్నారు.

కలుషిత నీటితో రోగాలు..

మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు పచ్చని రంగులో వస్తోంది. తాగేందుకు వీలు లేకుండా ఉంది. ఇలాంటి కలుషిత నీటిని తాగితే ఎలాంటి వ్యాధులు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. వాడుకునేందుకు సైతం ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి. -గోపాల్, చీకూర్తి, న్యాల్‌కల్ మండలం

పచ్చని రంగులో నీరు వస్తోంది..

నాలుగైదు రోజుల నుంచి పచ్చని రంగులో కలుషితమైన నీరు వస్తున్నాయి. నల్లాలో నుంచి బకెట్లు, బిందెళ్లలో పడిన నీటిని చూడగానే భయంకరంగా కనిపిస్తున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతోనే ఫిల్టర్ కాకుండానే ఇలా నీటిని సరఫరా చేస్తున్నారు. పెద్ద సార్లు స్పందించి చర్యలు తీసుకోవాలి. - భూమారెడ్డి, చీకూర్తి, న్యాల్‌కల్ మండలం

ఖూభా తండాలో తీవ్ర నీటి సమస్య

ఖూభా తండాలో తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద గుమిగూడిన ప్రజలు

- పక్షం రోజులుగా నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా
- వ్యవసాయ బావుల నుంచి నీరు తెచ్చుకుంటున్న గిరిజనులు

నాగల్‌గిద్ద, ఆగస్టు 1 : సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలంలోని ఖూభా తండా పంచాయతీలో తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. ఈ తండాలో 500 జనాభా నివసిస్తున్నారు. నీటి సమస్య తీర్చడానికి పంచాయతీ నుంచి ట్యాంకర్ ఏర్పాటు చేసి నీరందిస్తున్నా అవి సరిపోవడం లేదని గిరిజనులు తెలిపారు. తాగునీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు కిలోమీటర్ల మేర వెళ్లి తెచ్చుకుంటున్నారు. మహిళలు కొండలు, కోనలు దాటి బిందెల ద్వారా తాగునీటిని తెచ్చుకోవడానికి అవస్థలు పడుతున్నారు. కొంత మంది ద్విచక్ర వాహనాలపై, ఆటోల మీద వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. పదిహేను రోజులుగ మిషన్ భగీరథ నీరు రావడం లేదన్నారు. చేతిపంపులు మరమ్మతులు చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారి మూలన పడ్డాయని తండాలువాసులు తెలిపారు. అధికారులు స్పందించి తండాలో నీటి సమస్యను పరిష్కరించాలి.

నీటి సమస్య తీర్చండి సార్లు..

మా తండాలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. తాగునీరు, ఇతర అవసరాలకు గ్రామంలో చుక్కనీరు లేదు. ఉదయం, సాయంత్రం బిందెలు పట్టుకుని రెండు మూడు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వ్యవసాయ బావులు వద్దకెళ్లి నీరు తెచ్చుకోవాల్సి పరిస్థితి ఉంది. మిష న్ భగీరథ నీరు ఎప్పుడు వస్తదో తెలియడం లేదు. అధికారులు స్పందించి మా తండాలో నీటి సమస్యను పరిష్కరించాలి.

- లక్ష్మీబాయి, గిరిజన మహిళ, ఖూభాతండా

సీఎం రేవంత్ అహంకార ధోరణి వీడాలి

బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డికి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 1: శాసనసభలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను కించపర్చే విధంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంకార ధోరణి వీడాలని, భేషరతుగా మహిళాలోకానికి క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అమెరికాకు వెళ్లిన ఆమె గురువారం ఒక ప్రకటనలో సీఎం మాట్లాడిన తీరుపై స్పందించారు. శాసనసభలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతావా, తెలంగాణ ఆడబిడ్డలంటే అంత చులకనా, ముఖ్యమంత్రి అని మితిమీరిన గర్వంతో మాట్లాడుతున్నావు, అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. ఆడబిడ్డలను ఏడిపిస్తే ఆ ఉసురు ఊరికే పోదన్నారు. ఎమ్మెల్యేలు

రోడ్డెక్కిన విద్యార్థులపై కన్నెర్ర

- సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి..ధర్నాలు చేయవద్దు
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి హెచ్చరిక

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

మునిపల్లి,ఆగస్టు 1: నమస్తే తెలంగాణ దినపత్రికలో బుధవారం వచ్చిన 'లెక్చరర్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు' అనే కథనానికి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి స్పందించారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాల/కళాశాలను గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో పారిశుధ్యం పనులు అస్తవ్యస్తంగా ఉండటం చూసి సంబంధిత అధికారులపై మండిపడ్డారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి తప్పా రోడ్లపై ధర్నాలు చేయడం సరైంది కాదన్నారు. ఉపాధ్యాయులకు బదిలీలు సహజమే...అందుకు వెళ్లిన టీచర్లే మళ్లీ రావాలంటే రూల్స్ ఒప్పుకోవు కదా అని విద్యార్థులకు చురకలు అంటించారు. రోడ్లపై విద్యార్థులు ధర్నా చేసే వరకు ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారంటూ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం హాస్టల్‌లో ఉన్న సమస్యలపై ఆమె విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంతీర్పు చారిత్రాత్మకం

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ కోసం 50 ఏండ్ల నుంచి ఎదురు చూస్తున్న దళిత జాతికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం చారిత్రాత్మకమని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచే ఎస్సీ వర్గీకరణ కోసం గులాబీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో డిమాండ్ చేశామన్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తు చేశారు. వర్గీకరణ కోసం నేరుగా ప్రధాన మంత్రిని కలిసి విన్నవించారన్నారు. ప్రస్తుతం కోర్టుతీర్పు నేపథ్యంలో ఉద్యోగ అవకాశాల్లో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

47 మంది బాలకార్మికులకు విముక్తి

మెదక్‌లో మెకానిక్ షాపులో పనిచేస్తున్న బాలుడిని పట్టుకున్న అధికారులు

మెదక్ అర్బన్, ఆగస్టు1:మెదక్ జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ బృందం 47 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించి, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. బడికి వెళ్లాల్సిన బాలలు కష్టతరమైన పనుల్లో పనిచేయడం సమాజాభివృద్ధికి ఆటంకమన్నారు. బాలకార్మిక వ్యవస్థ ఇంకా కొనసాగడం దురదృష్టకరమన్నారు. ఈ సమస్యను అధికమించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నదన్నారు. ఇది సామాజిక,ఆర్థిక సమస్యతో ముడిపడి ఉందని, దీన్ని రూపుమాపేందుకు మెదక్ జిల్లా ఆపరేషన్ ముస్కాన్ పోలీస్ బృందం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్‌మెంట్, సఖిసెంటర్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్, వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులు సంయుక్తంగా ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్ బృందం దాడులు చేసిందన్నారు. కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లలో పనిచేస్తూ వదిలివేయబడిన పిల్లలు, రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు, బాలకార్మికులుగా పనిచేస్తున్న పిల్లలను గుర్తించి 47మంది బాలురని పట్టుకుని సంబంధిత అధికారుల ద్వారా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించామన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా బాలకార్మికులను పనిలో పెట్టుకున్నా లేక వారితో బలవంతంగా పని చేయించినా, ఒంటరిగా బాధపడుతున్న బాలలను చూసినప్పుడు,తప్పిపోయిన, వదిలివేయబడిన బాలలను చూసినప్పుడు 1098 లేదా 100,112కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పంట రుణమాఫీ గందరగోళం

- సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలోని టీజీబీకి భారీగా తరలివచ్చిన లబ్ధిదారులు
- పోలీసుల ప్రహారాలో బ్యాంకు సేవలు

అక్కన్నపేట, ఆగస్టు 1: ప్రభుత్వం చేపట్టిన పంట రుణమాఫీ క్షేత్ర స్థాయిలో గందరగోళంగా మారింది. మొదట లక్ష లోపు, ఆ తర్వాత రెండో విడత లక్షన్నరలోపు మాఫీ చేసినట్లు ప్రకటించడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. గురువారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు వచ్చారు. దీంతో బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీస్ కానిస్టేబుల్ రమేశ్ అక్కడికి చేరుకొని లబ్ధిదారులతో మాట్లాడి ప్రశాంతంగా బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంకుకు వచ్చిన వారిని క్యూలో ఉంచాడు. పంటరుణ మాఫీ రైతులతో పాటు పింఛన్లు తీసుకునేందుకు లబ్ధిదారులు రావడంతో బ్యాంకు కిక్కిరిసిందని మేనేజర్ జ్యోత్స్న తెలిపారు.

సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలోని టీజీబీలో పోలీస్ పహారాలో బ్యాంకు సేవలు వినియోగించుకుంటున్న లబ్ధిదారులు

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

- రెండు లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధే లక్ష్యం
- వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాల శివారులో రెండు వేల ఎకరాల భూమి సేకరణ

– సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి

భూసేకరణ సర్వేపై అధికారులతో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

న్యాల్‌కల్, ఆగస్టు1: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం నిమ్జ్ పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే భూసేకరణ చేపట్టిన విషయం తెలిసిందే. అందులోభాగంగానే మండలంలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికోసం మల్గి, డప్పూర్, వడ్డి గ్రామాల శివారులో రెండు వేల ఎకరాల్లో భూము లు సేకరించేందుకు పరిశ్రామశాఖ, రెవెన్యూ అధికారులు సర్వేలు చేపట్టారు. ఆయా గ్రామాల శివారులో దాదాపు 1400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరో 400 ఎకరాల పట్టా భూములను సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. గురువారం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధితశాఖాధికారులతో కలిసి వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాల శివారులోని భూములను పరిశీలించి భూమి వివరాలను తెలుసుకున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూముల సర్వేపై ఆరా తీశారు. మరో 20 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మల్గి శివారులోని గుట్టపై పురాతన ఆలయాలు ఉన్నాయని, అక్కడ భూమిని సేకరించవద్దని మాజీ సర్పంచ్ మారుతీ యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్ధారెడ్డి కలెక్టర్‌ను కోరారు. తొలిసారిగా వచ్చిన కలెక్టర్‌కు డప్పూర్, మల్లి మాజీ సర్పంచ్‌లు రవికుమార్, మారుతీయాదవ్ పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె వెంట టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ రతన్‌రాథోడ్, జహీరాబాద్ నిమ్జ్ భూసేకరణ డిప్యూటీ కలెక్టర్లు నాగలక్ష్మి, రవీందర్‌రెడ్డి, జహీరాబాద్ ఆర్డీవో రాజు, ల్యాం డ్ సర్వేయర్ ఐలేశ్, డిప్యూటీ సర్వేయర్ భిక్షపతి, జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, తహసీల్దార్ రాజిరెడ్డి, నిమ్జ్ డిప్యూటీ తహసీల్దార్ జనార్దన్ ఉన్నారు.